



RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

నిజానికి రాయల్ స్వరం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 154 | బుధవారం 11 - 2 - 2026 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 154 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 11 WEDNESDAY february 2026 PAGES : 8 Rs :2-00


## మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

- ఎన్నికల సంఘం విచారణ జరపాలి
- రేవంత్ రెండేళ్లుగా ఏమీ చేయకుండా తనపై విమర్శలా
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ: మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్ధాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్య మంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లు.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు.

## నేటికీ ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడుతున్న బీఆర్ఎస్: పొంగులేటి



ఖమ్మం,: భారత రాష్ట్ర సమితి నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారన్న అనుమానం వస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీనితోనే ట్యాపింగ్‌లో వారు ఆరితేరారని గుర్తించవచ్చని అన్నారు.

## పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్

- శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి
- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ,: ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎఎ పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు.గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యూడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

**మరోమారు విమర్శలు గుప్పించిన కవిత**



హైదరాబాద్: కేవలం సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయ పడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవా లని ప్రజలకు సూచించారు. కేవలం సిద్దిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

## జగ్గారెడ్డిపై సదాశివపేటలో కేసు నమోదు



హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై కేసు నమోదయింది. మున్సిపల్ ఎన్నికల నియమావళిని ఉల్లగించారని ఆయనపై సదాశివపేట పీఎస్ లో కేసు నమోదు చేశారు. సదాశివపేటలోని ఓ హోటల్ వద్ద పేదలకు, వృద్ధులకు డబ్బులు పంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సీఐ వెంకటేశ్ అక్కడకు చేరుకుని... అక్కడ ఉన్న జగ్గారెడ్డిని, మరికొందరు స్థానికులను అక్కడి నుంచి పంపించివేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డబ్బులు పంచడం పట్ల పీఎస్ లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మరోవైపు, దీనిపై జగ్గారెడ్డి అనుచరులు స్పందిస్తూ... ఆ హోటల్ వద్ద జగ్గారెడ్డికి టీ తాగే అలవాటు ఉందని... ఆయన అక్కడ ఆగిన సమయంలో తన వద్దకు వచ్చిన పేదలకు, వృద్ధులకు డబ్బులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఘటనపై జగ్గారెడ్డి ఇంకా స్పందించాల్సి ఉంది. మరోవైపు, మున్సిపల్ ఎన్నికలు రేపు జరగను న్నాయి. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కువ విజయాలను సాధించి మరోసారి సత్తా చాటాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి పూర్వవైభవాన్ని పొందే దిశగా అడుగులు వేయాలని బీఆర్ఎస్ శ్రమిస్తోంది.

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

**నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు**

న్యూఢిల్లీ,: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళ వారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవి శ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూట మిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరిం చింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తు న్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత




సమావే శాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

## ఓటమి భయంతోనే మహదేవప్పకు బెదిరింపులు



హైదరాబాద్,: మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణ పేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. బీజేపీ కార్యకర్తలారా.. ధైర్యంగా ఉండండి, నాయకత్వం మీకు అండగా ఉంది. మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బయలుదేరారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# పొన్నాల కాలువ అభివృద్ధికి నిధులు మంజూరుకు మంత్రి భరోసా

## ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు హర్షం



రాయల్ జర్నలిజం (కర్లపాలెం), ఫిబ్రవరి 10: అకాల వర్షాలతో తల్లడిల్లి పోతున్న తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు వెల్లడించారు. కర్లపాలెం మండలంలోని పొన్నాల కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా జల వనరుల శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. తీర ప్రాంత ప్రజల కష్టాలు తీర్చేందుకు మంత్రి ఇచ్చిన హామీతో మోక్షం లభించబోతుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ హర్షం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పొంగి ప్రవహించే పొన్నాల కాలువతో కర్లపాలెం మండల ప్రాంతంలోని అనేక తీర గ్రామాలు అనాదిగా ఇక్కట్లు పడుతున్నాయని చెప్పారు. పెదగొల్లపాలెం, ప్యార్లిపాడు, తుమ్మలపల్లి, నక్రావారిపాలెం, కట్టవాద ప్రజలకు పొన్నాల కాలువ వల్ల పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వివరించారు. భారీ వర్షాల సమయంలో ఈ కాలువ ద్వారా పొంగి ప్రవహించే నీటితో రహదారులు మొత్తం స్తంభించిపోతున్నాయని అన్నారు. రవాణా వ్యవస్థ పూర్తిగా దీనివల్ల నిలిచిపోతుందని వివరించారు. వర్షాల సమయంలో ఐదు గ్రామాల ప్రజలకు పొన్నాల కాలువ శాపంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. కట్టలు బలహీనంగా మారటం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. సారవంతమైన భూములు, అనేక పంటలు పండించే ఈ గ్రామాల్లో పొన్నాల కాలువ ప్రవహించే రోడ్డు ను అభివృద్ధి చేయటం ద్వారా రైతుల ఉత్పత్తులకు సులువైన రీతిలో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. పొన్నాల వాగు మీదుగా ఎత్తు పెంచి ఏర్పాటు చేసే రహదారితో రైతులకు ఎంతో వెసులుబాటు ఉంటుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మంత్రి జనార్ధన్ రెడ్డికి వివరించారు. దీనికోసం రూపొందించిన రూ 3.75 కోట్ల అంచనాలతో వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. దీని అభివృద్ధికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జనార్ధన్ రెడ్డి త్వరలోనే ఆయా నిధులు మంజూరు చేసేందుకు తగిన హామీ ఇచ్చారని నరేంద్ర వర్మ తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో పొన్నాల కాలువ అభివృద్ధి ద్వారా వేలాది మంది రైతులకు వెసులు బాటు కలగబోతుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# పాకాల బీచ్ ఫెస్టివల్ సముద్ర తీరంలో ఆనందోత్సాహాలు



రాయల్ జర్నలిజం (ఒంగోలు) ఫిబ్రవరి 10 : ప్రకాశం జిల్లాలో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ ను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా అధికారులతో సమావేశమై ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణలో భాగంగా శాఖల వారీగా చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణపైకు సంబంధించి నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ సిఈఓ ను నియమించడం జరిగిందన్నారు. పాకల బీచ్ ప్రాముఖ్యత జిల్లా ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలకు తెలిసేలా పాకల బీచ్ ఫెస్టివల్ ను విజవంతంగా నిర్వహించేలా ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ అధికారులు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ కు వచ్చే సందర్శకుల ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య , మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వసతి, పార్కింగ్ ఏర్పాట్లు పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా వివిధ రకాల సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, హెలికాప్టర్ రైడింగ్, లేజర్ షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను, ఫుడ్ కోర్టులను నిర్వహిస్తున్నందున సంబందిత ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా విచ్చేసే విఐపి, వివిఐపి ల ప్రోటోకాల్ లో ఎలాంటి అశ్రద్ద లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫెస్టివల్ సందర్భంగా సందర్శకులకు అసౌకర్యం కలగకుండా అన్నీ ప్రాంతాల నుండి ఆర్ టి సి బస్సు లను నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేసి పాకల బీచ్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్డిసి శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, డిఆర్డిఎ పిడి నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, ఐసిడిఎస్ పిడి సువర్ణ, విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



**రాయల్ జర్నలిజం (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 10:** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండల తహశీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులను మంజూరు చేయాలని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి ఎమ్మెల్యేఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ పిట్టలవానిపాలెం మండల ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రారంభించిన తహశీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం పనులు నిధుల కొరత కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయని ప్రస్తుతం పాత భవనంలో కార్యకలాపాలు సాగించడం వల్ల సిబ్బందికి, పనుల నిమిత్తం వచ్చే సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి, భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిగారిని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను బట్టి, నిధుల విడుదలకు సంబంధించి అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మేలుజాతి లేగదూడల ప్రదర్శన




రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 10: బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెంలో మంగళవారం మేలుజాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు తెలియజేసి బహుమతులు అందజేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. వేణుగోపాల్, డీఎల్డీఏ ఈవో డా. బి. మురళీకృష్ణ, చీరాల ఏడీ, మండల ప్రత్యేకాధికారి డా. సజ్జా చిట్టిబాబు, వేటపాలెం వైద్యాధికారి డా. భాగ్యశ్రీ, డా. పుష్పలత, వీఏఎస్‌లు, రైతులు పాల్గొన్నారు.

# నెల్లూరు మేయర్ పదవి ఎస్టీలకే ఇవ్వాలి

## మద్దతు తెలిపిన బాపట్ల జిల్లా గిరిజన యాత్ ఫెడరేషన్




రాయల్ జర్నలిజం (వేటపాలెం, ఫిబ్రవరి 10: నెల్లూరు పట్టన మేయర్ పదవి ఎస్టీలకే ఇవ్వాలని బాపట్ల జిల్లా గిరిజన యాత్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డ్మాండ్ చేశారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద మేయర్ పదవిపై జరుగుతున్న 11వ రోజు నిరసన దీక్షలో మంగళవారం బాపట్ల జిల్లా గిరిజన యాత్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రిజర్వేన్ వలన 45 సంవత్సరాలు తరువాత నెల్లూరు పట్టణ మేయర్ పదవి ఎస్టీట్ కమ్యూనిటి యానాది జాతికి సంబందించిన పొట్లూరి స్రవంతికి వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పెద్దలు మేయర్ పదవి ఇవ్వటం జరిగిందని, ప్రస్తుత నెల్లూరు కూటమి ప్రభుత్వ నాయకుల కనుసన్నల్లో కుట్రలు పన్ని అవిశ్వాస తీర్మానం పెట్టి అన్యాయంగా పదవి కాలం 8 నెలలు ఉండగానే పదవి నుండి తప్పించటం జరిగిందన్నారు. మరో కొత్త ఎస్టీ మేయర్ పదవికి ఎలక్షన్స్ నోటిఫికేషన్ ఇవ్వకుండా రాజ్యాంగంలోని లొసుగులు ఉపయోగించుకొని ఎస్టీ వర్గానికి మేయర్ పదవి దక్కనియ్యకుండా కుట్రలు పన్నుతున్న కూటమి ప్రభుత్వ పెద్దలు చేసిన తప్పు సరిచేసుకోపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని, 11వ రోజు మంగళవారం నెల్లూరు కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగిన నిరవధిక రిలే నిరాహార దీక్షలో యానాదుల (గిరిజన) యాత్ ఫెడరేషన్ నాయకత్వం పాల్గొని మేయర్ పదవి గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా నుంచి యానాదుల గిరిజన యాత్ ఫెడరేషన్ జిల్లా





చైర్మెన్, డీవీఎంసీ మెంబెర్ కొమరగిరి వెంకట ప్రసాద్, జిల్లా అధ్యక్షులు చౌటూరి రమేష్, ప్రధాన కార్యదర్శి గందళ్ళ నరేష్, సంయుక్త కార్యదర్శులు ఇండ్ల సుధాకర్, కోమిటి అంకమ్మరావు, వేటపాలెం మహిళా అధ్యక్షురాలు రాపూరి అల్లూరమ్మ పాల్గొన్నారు.

# విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 10:జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆమోదగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఅవసరమైన విద్యార్థులకు మంగళవారం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖరరావు మాట్లాడుతూ గతంలో హైస్కూలు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అవసరమైన వారికి కళ్లజోళ్ళు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో అందజేయడం జరిగిందని, సర్వేంద్రియానం నయనం ప్రధానమని, కళ్ళను మనం సంరక్షించుకోవాలని తెలియజేయడం జరిగింది. వేటపాలెం పీహెచ్‌సీ కంటి వైద్య నిపుణులు సుధాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ కళ్ళను ఎప్పటికప్పుడు పరీక్ష చేసుకోవాలని, ఏమైనా బోర్డ్ పైన అక్షరాలు కనపడకపోతే వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించాలని, కళ్ళకు సంబం దధించి విటమిన్ ఏ ఉన్న పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టా శివప్రసాద్, వై. రత్నం, కే. సుధాకరరావు, పద్మావతి, జి. మురళి, ఎం. రాజలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల ఉత్తీర్ణతలో బాపట్ల జిల్లా టాప్-3 లో ఉండాలి : బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 10: ఇంటర్మీడియట్ పరీక్షల ఉత్తీర్ణతలో బాపట్ల జిల్లాను టాప్-3 లో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. విద్యారంగం అభివృద్ధి అంశాలపై విద్యాశాఖ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం మరింత పెరగడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 23వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న తరుణంలో జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, 400 మంది విద్యార్థులు గైర్హాజర్ పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్చూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 83 మంది విద్యార్థులకు గాను 62 మంది మాత్రమే హాజరవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన కళాశాలలలోను ఇదే మాదిరి కారణాలు లేకుండా విద్యార్థులు గైర్హాజరవడం, నిర్లిప్తంగా వ్యవహరించడంపై అసహన వ్యక్తం చేశారు. ముందస్తుగా నిర్వహించిన ప్రీ పబ్లిక్ పరీక్షలలో చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలలో 91 విద్యార్థులు హాజరు కాగా, 33 మంది ఫెయిల్ అవ్వడం ఏమిటని నిలదీశారు. చీరాలలో 39 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని కళాశాలల ప్రధానాచార్యులు, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఓను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నివేదించాలన్నారు. అధికారులే బాధ్యతారహిత్యంగా పనిచేస్తుంటే పిల్లలు ఎలా చదువుకుంటారని కలెక్టర్ నిలదీశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలి, అలాగే నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యతను ప్రధాన ఆచార్యులు విస్మరించడం మంచి పద్ధతి కాదన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పాటును అందించాలన్నారు. మీ నిర్లిప్తత విద్యార్థులకు శాపంగా మారకూడదన్నారు. కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇప్పటివరకు విద్యార్థుల పట్ల శ్రద్ధ లేకపోవడంతోనే ఫలితాలు తక్కువగా వస్తున్నాయన్నారు. సమగ్ర ప్రణాళికతో అధికారులు ముందుకు నడవాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద ప్రభుత్వ పాఠశాలల్లో 437 పనులకు రూ.29 కోట్ల నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్యాలపై శిక్షణలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉద్యోగమేళాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో శ్రీనివాస్ సింగ్, ఇంటర్మీడియట్ బోర్డ్ జిల్లా అధికారి జుబేర్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రధానాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

రాయల్ జర్నలిజం (ఒంగోలు) ఫిబ్రవరి 10 :అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం సంతనూతల పాడు మండలం, పిడతల గుడిపాడులో అంగన్వాడీ కేంద్రం - 1 ,2 లను ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీ సెంటర్ - 1 లో 9.గంటలకి రావలసిన పిల్లలు 10:30 అయిన కూడా పిల్లలు రావకపోవటం పై, కోడి గుడ్లు నిల్వ ఉండటం, రిజిస్టర్ లు సరిగా నిర్వహించకపోవటం వంటివి గుర్తించి అంగన్వాడీ టీచర్, సూపర్వైజర్ పై అసహనం వ్యక్తం చేశారు.సంబంధిత సూపర్ వైజర్ సావిత్రి కి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పిడతల గుడిపాడు సెంటర్ -2 లో విద్యార్థుల హాజరు పట్టికనుచూసి, తప్పుగా హాజరు వెయ్యటం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అంగన్వాడీ కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటాం పైన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే విద్యార్థులు వ్యాధుల బారిన పడే



అవకాశం ఉందన్నారు. విద్యార్థులకి, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత పెద్ద మొత్తం లో ఖర్చు చేస్తుంటే మీరు ఇలా చెయ్యటం పద్ధతి కాదని ఆయన చెప్పారు. జణూా లు, సూపర్ వైజర్ లు నిరంతరం తనిఖీలు చేస్తూ అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు.

పిడతల గుడిపాడు లో ఏం.పి. యు.పి.స్కూల్ లో వంటశాల పెచ్చులు ఉండటంతో ఏజెన్సీ వాళ్ల ఇంటిలో వంట వండటం తో ఆయన అసంతృప్తి చేస్తూ, రేపటి నుండి పాఠశాల లోనే వంట వండి తనకి ఫోటోలు పెట్టాలని ఆదేశించారు.

**ఎర్రగుడిపాడులో ....**

ఎర్రగుడిపాడు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎస్.టి కాలనీ లోని అంగన్వాడీ కేంద్రం అసలు ఓపెన్ చెయ్యలేదని, ఎస్ .సి కాలనీలోని కేంద్రాల్లో పిల్లలు లేరు , పిల్లలకి, బాలింతలకు ఇచ్చే ఆహారం ఆహారం ఒక్కటి కూడా లేదని ఈ విషయం పై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులని ఆయన ఆదేశించారు.

ఆయన వెంట సాంఘీక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, డి.ఎస్.ఓ. పద్మశ్రీ, డీ.ఎం సివిల్ సప్లైస్ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష జిల్లా బాలిక సంరక్షణ అధికారి కే.హేమలత ,తదితర అధికారులు ఉన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు

రాయల్ జర్నలిజం (ఒంగోలు ) ఫిబ్రవరి 10 :జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా చక్కని దైవ దర్శనం కలిగేలా మహా శివారాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఒంగోలు కలెక్టరేట్లోని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజబాబు, రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖ అధికారులతో వర్చువల్ గా సమావేశమై ఈ నెల 15న మహా శివారాత్రి సందర్భంగా జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలలో చేపట్టవలసిన మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా వచ్చే సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా మహా శివారాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. బైరవకొన, త్రిపురాంతకం, రామతీర్థం వంటి ప్రముఖ శైవ క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు అవుతారని, అందుకనుగుణంగా దర్శిన క్యూ లైన్లు, తాగునీటి సరఫరా, ఆహారం, పటిష్ట ఏర్పాట్లు, పార్కింగ్, బందోబస్తు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు, సీసీ కెమెరాలను ఈ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయడం, క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, భక్తుల సౌకర్యార్థం అవసరమైన పీఏ సిస్టం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి కార్యాలయం నుండి జిల్లా ఎస్పి వి . హర్షవర్ధన్ రాజు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, దేవాదాయ సహాయ కమీషనర్ పానకాల రావు, డిపిఒ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు , క్షేత్ర స్థాయి నుండి రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖ లకు చెందిన డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలింపు

## ఆర్థిక స్తోమత లేక ద్విచక్ర వాహనం మీదే 14 కిలోమీటర్లు మృతదేహం తరలింపు

## ప్రవేట్ అంబులెన్స్ లో తరలించాలంటే మూడు నుండి నాలుగు వేలు పై మాటే: ఘటనపై స్పందించిన జిల్లా కలెక్టర్



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 10 : బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతయపాలెం పంచాయతీ రాళ్లచెరువుకు చెందిన నక్క నాగేశ్వరరావు మంగళవారం గుండెనొప్పి వచ్చింది. వెంటనే వారి సోదరులు కుటుంబీకులు ద్విచక్ర వాహనంపై బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అక్కడికి తీసుకొని వెళ్ళేసరికి నాగేశ్వరరావు మృతి చెందారు. అయితే ఆటోలో మృతదేహాన్ని తరలించడానికి మూడు వేల వరకు అడగటంతో తమ దగ్గర అంత స్తోమత లేదని 14 కిలోమీటర్లు ద్విచక్ర వాహనం మీదే మృతదేహాన్ని వారి గుడిసెలకు తరలించారు. ఇదంతా జరిగింది బాపట్ల జిల్లా కేంద్రానికి సమీపంలో. 14 కిలోమీటర్ల దూరంలోనే. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం 'మహాప్రస్థానం' వాహనం అందుబాటులో లేదని తెలిపారు. అయితే జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో ఈ వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రికి మహాప్రస్థానం వాహనం మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో నమోదయ్యే మరణాల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని మహాప్రస్థానం వాహనాల కేటాయింపు జరుగుతుందని పెర్కొన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో మరణాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఇప్పటివరకు వాహనం కేటాయించలేదని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి మృతదేహాల రవాణా బాధ్యతను కుటుంబ సభ్యులు భరించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధుల ద్వారా నిరు పేదలకు ప్రభుత్వమే అవసరమైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుందని తెలిపారు.అనివార్య కారణాల వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు, విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ లేదా మెడికల్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆసుపత్రి అంబులెన్స్ ఏర్పాటు చేయడం లేదా అవసరమైన ఆర్థిక సహాయం అందించిన తరువాతే మృతదేహాన్ని డిశ్చార్జ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పోలీస్, ఆర్టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులతో త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి అంబులెన్స్ ఛార్జీల నియంత్రణపై నిర్ణయాలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# గుండ్లకమ్మ ప్రాజెక్టులో సుమారు పది లక్షల చేపపిల్లలు



రాయల్ జర్నలిజం ( గుండ్లకమ్మ) ఫిబ్రవరి 10 :మణికేశ్వరంలో మీనోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి గుండ్లకమ్మ ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలిన మంత్రి గొట్టిపాటి మత్స్యకారుల ఉపాధి, సంక్షేమం కోసం గతేడాది 20 లక్షల చేప పిల్లలను వదిలాం ఈ ఏడాది కూడా సుమారు పది లక్షల పిల్లలను గుండ్లకమ్మలో వదిలాం గత ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్వీర్యం చేసింది వైసీపీ నేతలు గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు విరగగొట్టి ఇసుక దోపిడీ చేశారుకూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రాజెక్టు గేట్లు పెట్టి.. 2 టీఎంసీల నీరు నిల్వ ఉంచాం మత్స్యకారుల సంక్షేమం కోసం రాయితీతో వలలు, బోట్లు అందజేస్తున్నాం వేట నిషిద్ధ సమయంలో కూడా మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది

# వైద్య ఖర్చులకు నగదు అందజేత



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 10:
చీరాల మండలం దేవాంగపురి పంచాయతీలోని అయోధ్యనగర్‌కు చెందిన నిరుపేద చేనేత కార్మికుడు గుత్తి పరమేశ్వరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుచుండగా బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం, దేవల మనుబ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు రూ. 15వేలు నగదు సాయం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవల మనుబ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వొలుకుల మోహనరావు, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుర్మా రాహుల్‌జీ, కోశాధికారి చింతా రాము, ఉపాధ్యక్షులు చల్లా విజయ్, నాసిక జగన్, గౌరవ సలహాదారులు పన్నెం మోహన్ రావు పాల్గొన్నారు.

# బాపట్ల సేవా సేతు ద్వారా పేద విద్యార్థులకు చేయూత



రాయల్ జర్నలిజం (బాపట్ల),ఫిబ్రవరి 10 : ఏపీ ఆర్ ఎస్ ఏ నాయకులు పేద పిల్లలకు సహాయం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు బాపట్ల సేవా సేతు భరోసా కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నందు ఏపీ ఆర్ ఎస్ ఏ నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీరాల లోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహానికి బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ తరుపున రూ.30 వేలు విలువైన 4 బెంచీలు, 30 చాపలు, 4 షటిల్ బ్యాట్ లు, నెట్, క్యారమ్ బోర్డు, వాలీ బాల్ నెట్ లను సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి అందజేశారు.బాపట్ల సేవా సేతు ద్వారా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, జిల్లా లో పని చేయుచున్న రెవిన్యూ ఉద్యోగుల తరపున, బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ వారు తమ విరాళాలను విద్యార్థినీలకు వినియోగించడం అభినందనీయమన్నారు. చీరాల లోని ఎస్ సి బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినీల కొరకు రూ.30 వేలు విలువచేసే సామగ్రి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. వాటికి సంబంధించిన బిల్లులను అందజేశారు.ప్రజలు చాలామంది తమ దాతృత్వాన్ని విరాళాల ద్వారా చాటుకుంటున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వాశిష్ట, డి ఆర్ ఓ ఎస్ లవన్న, జిల్లా ఎస్ సి సంక్షేమ శాఖ అధికారి శివలీల, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున్, బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ బాబు, కార్యదర్శి బి ఓంకార్ చీరాల డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్, కె గోపి కృష్ణ, టహశీల్దార్, చీరాల, సిటీ యూనిట్ ఆధ్యక్షులు శ్రీ ఎస్. కె. మహబూబ్ బాషా, కార్యదర్శి సుమంత్ రాజ్, బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ ఆన్స్ అధ్యాపకుడు మార్కండేయులుకు పిహెచ్‌డి డిగ్రి ప్రదానం



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 10:
స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగపు అధ్యాపకుడు ఉగ్గిరాల మార్కండేయులు పిహెచ్‌డి డిగ్రి సాధించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు మాట్లాడుతూ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగము అధ్యాపకుడు యు. మార్కండేయులుకు అన్నామలై యూనివర్సిటి పి.హెచ్.డి డిగ్రి పొందారని, యు. మార్కండేయులు సమర్పించిన కంపారేటివ్ థర్మల్ ఫరపార్మెన్స్ అనాలిసిస్ ఆఫ్ సోలార్ హీటర్స్ విత్ నానో కోటెడ్ అండ్ హైబ్రిడ్ నానో కోటెడ్ ఫ్లాట్ కనెక్టర్స్ అనే పరిశోధనా పత్రమునకు అన్నామలై యూనివర్సిటి పి.హెచ్.డి డిగ్రి ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. లక్ష్మి తులసి చావలి, డైరక్టర్స్ డా. సి. సుబ్బారావు, వనమా దోర నాగ సాయినాథ్, మొదటి సం. ఇన్‌చార్జి యస్. అమరనాద్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు మార్కండేయులుకు అభినందనలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో హెచ్‌యం మృతి

## విధులకు వెళుతూ హెచ్ యం మృతి చెందడం విద్య శాఖ కు తీరని లోటు :జిల్లా విద్య శాఖ అధికారి డి.శ్రీనివాస్

రాయల్ జర్నలిజం (బాపట్ల),ఫిబ్రవరి 10 : రోజు లాగా విధులకు బైక్ పై వెళుతూ ఏ.శ్రీనివాసరావు మృతి చెందడం చాలా బాధాకరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. చీరాల మండలం, గవిని వారి పాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో హెచ్ యం గా పని చేస్తున్న అంగిరేకుల శ్రీనివాసరరావు రోజు లాగా మంగళవారం ఉదయం తన ఇంటి నుండి బైక్ పై పాఠశాలకు వెళుతుండగా కేబుల్ వైర్ మెడకి తగలడంతో బైక్ మీద నుంచి కిందపడి మరణించడం చాలా బాధాకరమని, ఈ సందర్భంగా హెచ్ యం మృతికి తన ప్రగాఢ సానుభూతిని కలెక్టర్ తెలియజేశారు.విద్యాశాఖ లో గత కొన్ని సంవత్సరాలుగా పిల్లలకు విద్యాబోధన చేస్తూ మంగళవారం విధిరాత వల్ల రోడ్డు ప్రమాదంలో హెచ్ యం మరణించడం చాలా బాధాకరమని హెచ్ఎం మృతికి జిల్లా విద్యాశాఖ తరపున అధికారులు సిబ్బంది అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు



# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు.. హైకోర్టులో పిటీషన్

అమరావతి :ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల వ్యవహారం హైకోర్టుకు చేరింది. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు పదోన్నతి, ఇంక్రిమెంట్ ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది.. ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఏపీ హైకోర్టు తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు సంబంధించి ఇంక్రిమెంట్‌తోపాటు పదోన్నతి కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.పిటిషనర్ అయిన గ్రామ వార్డు సచివాలయ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడి తరఫున లాయర్ వాదనలు వినిపించారు. అయితే ఏపీ హైకోర్టు కౌంటర్ వేయాలంటూ.. గ్రామ, వార్డు సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్.. సాధారణ పరిపాలనశాఖ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి రమేష్ ఉత్తర్వులిచ్చారు. మరి హైకోర్టు ఈ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.మరోవైపు స్వర్ణ గ్రామ-స్వర్ణవార్డు సచివాలయాలకు సంబంధించి మూండంచెల వ్యవస్థకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. సచివాలయాల వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా.. పర్యవేక్షణ కోసం ఈ మూడంచెల వ్యవస్థను రూపొందించిన సంగతి తెలిసిందే. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో సచివాలయాలు పనిచస్తాయి. ప్రధానంగా జిల్లాస్థాయి అధికారులు సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే బాధ్యతను తీసుకుంటారు. అంతేకాదు సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిపై ఏవైనా ఫిర్యాదులు వస్తే విచారణ చేసి కలెక్టర్లకు నివేదిక సమర్పిస్తారు. మండల స్థాయిలో అధికారులు సచివాలయాల్లో సౌకర్యాలో పాటూ మరికొన్ని బాధ్యతల్ని చూసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల గ్రామ/వార్డు సచివాలయాల పేరును కూడా మార్చిన సంగతి తెలిసిందే. ఇకపై స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలుగా మార్చేశారు. అంతేకాదు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మేరకు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు.. సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు మనమిత్రపై అవగాహన కల్పిస్తున్నసంగతి తెలిసిందే.

# వాళ్లందరికి షాక్.. ఆస్తులు సీజ్ చేస్తున్నారు.. మీరు ఉన్నారేమో, చెక్ చేస్కోండి




అమరావతి : విశాఖపట్నంలో జీవీఎంసీ దూకుడు పెంచింది.. మొండి ఆస్తి బకాయిల్ని రాబట్టే పనిలో ఉంది. ఎన్నో ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించనివారి నుంచి బకాయిలు వసూలు చేస్తోంది. ఈ మేరకు బకాయిలు చెల్లించనివారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ తర్వాత బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.. అయినా కూడా బకాయిలు చెల్లించకపోతే జప్తు నోటీసులు ఇచ్చి మరీ.. వారి ఆస్తుల్ని కూడా సీజ్ చేస్తున్నారు.విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతున్నాయి.విశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు.ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు.. అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులలతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గత ఏడాది విశాఖపట్నం జిల్లా.. స్థూల ఉత్పత్తిలో రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో నిలబడింది.

# ఏపీ ఉచిత బస్సు పథకం.. మహిళలకు గుడ్‌న్యూస్..

అమరావతి :ఏపీలో మహిళలకు ఆర్టీసీ మరో తీపికబురు చెప్పింది. ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్న సంగతి తెలిసిందే. ఆ బస్సుల్లో కూడా ఉచితంగా ప్రయాణం చేయొచ్చని అధికారులు తెలిపారు. మహిళలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆర్టీసీ మహాశివరాత్రి సందర్భంగా డిపోల నుంచి స్పెషల్ బస్సులు నడపనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు స్త్రీ శక్తి పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. అయితే ఆర్టీసీ మహిళలకు మరో శుభవార్త చెప్పింది. ఈ నెల 15న మహాశివరాత్రి పండగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యకంగా బస్సులు నడుపుతోంది. ఆర్టీసీ నడిపే ఈ స్పెషల్ బస్సుల్లోనూ స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు కీలక ప్రకట చేశారు. పల్నాడు జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.ఈ స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ రోజుల్లో మాదిరిగానే మహిళలు రాకపోకలు సాగించవచ్చున్నారు అధికారులు. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 70 బస్సులు నడుపుతున్నామని ప్రకటించారు. మొత్తం 618 ప్రత్యేక బస్సులు భక్తుల కోసం అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అంతేకాదు మహాశివరాత్రి సందర్భంగా.. రెండు వేల మంది సిబ్బందితో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.ఈ మేరకు బస్సు ఛార్జీల వివరాలను కూడా అధికారులు వెల్లించారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండకు రూ.30.. అలాగే కొండ దిగువ నుంచి పైకి రూ.25గా నిర్ణయించారు. అంతేకాదు వినుకొండ, సత్తెనపల్లి, అద్దంకి, చీరాల డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడపనున్నట్లు చెప్పారు. కోటప్ప కొండ నుంచి నరసరావుపేటకు తిరిగి వెళ్లే ప్రయాణికులకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పెట్లూరివారిపాలెం దగ్గర ఆర్టీసీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్పెషల్ బస్సుల్లో కూడా ఉచితంగా ప్రయాణం చెయొచ్చని.. ప్రతి ఒక్కరూ ఈవిషయాన్ని గమనించాలని సూచించారు.

# మచిలీపట్నానికి మహర్దశ.. కొత్తగా 200 ఎకరాల్లో మరో ప్రాజెక్ట్.. రూ.7,600 కోట్లతో!

అమరావతి :మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా



నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# అనుకున్నది సాధించిన మంత్రి లోకేష్.. మంగళగిరికి కేంద్రం నుంచి తీపికబురు

అమరావతి :మంత్రి నారా లోకష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉంది. లోకేష్ చొరవతో ఈ ఆలయానికి ప్రసాద్ పథకం కింద నిధులు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. పానకాలస్వామి ఆలయాన్ని ఈ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. మంగళగిరి ఆలయం మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాలను కర్షీ ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. మంత్రి నారా లోకేష్ అనుకున్నది సాధించారు.. కేంద్రం సహకారంతో మంగళగిరి నియోజకవర్గానికి నిధులు తీసుకొస్తున్నారు. మంగళగిరిలో కొలువైన శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి దశ తిరిగింది. కేంద్రం ప్రసాద్ పథకంలో భాగంగా ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తోంది. మంత్రి నారా లోకేష్ స్వయంగా రంగంలోకి దిగి మంగళగిరి పానకాల స్వామి ఆలయాన్ని కూడా ప్రసాద్ పథకంలో చేర్చాలని కోరారు. కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఆ దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్రం సహకారంతో ప్రసాద్ పథకంలో భాగంగా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి పనులకు డీపీఆర్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. మంగళగిరి పానకాలస్వామి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.140 కోట్లు ప్రతిపాదించారు. దేవాదాయశాఖ కమిషనర్‌ను ప్రసాద్ పథకానికి సంబంధించి ప్రత్యేకాధికారిగా నియమించిన సంగతి తెలిసిందే. మంగిళగిరిత పాటుగా శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, అమరావతి ఆలయాలను కూడా ప్రసాద్ పథకంలో ఇప్పటికే చేర్చారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ వారసత్వ సంపదను జాగ్రత్తగా కాపాడుకుంటూ.. గత వైభవం దెబ్బతినకుండా ఆలయాలను అదే రీతిలో కొనసాగిస్తూ.. మంగళిరి పానకాలస్వామిని దర్శించుకునే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. కేంద్రానికి సమాచారాన్ని ఇప్పటికే పంపించారు.. డీపీఆర్‌లో చిన్న మార్పులు చేసి ఈ పనుల చేపట్టే దిశగా టెండర్లను ఆహ్వానించేందుకు కసరత్తు జరుగుతోంది.మంగళగిరి పానకాల స్వామి ఆలయంలో ప్రసాద్ పథకంలో భాగంగా.. కొండ చివరి ఉన్న గండాలయస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నారు.. కొండపైకి వెళ్లేలా రోప్‌వే ప్లాన్ చేశారు. కొండపైన పార్కింగ్ సౌకర్యంతో పాటుగా పార్కులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తుల కోసం కొండ దిగువున వసతి గదుల్ని నిర్మించాలని ప్రతిపాదించారు. అంతేకాదు కొండ చివరన 'మంగళగిరి' అనే పేరుతో 18 అడుగుల ఎత్తులో ఏర్పాటు



చేయాలని ప్లాన్ చేశారు. పోలీసుల క్వార్టర్స్ స్థలాన్ని ఆలయం కోసం తీసుకుని భక్తుల కోసం అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. మంగళగిరి ఆలయ చారిత్రక అంశాలు, ప్రాశస్త్యం గురించి మ్యూజియం.. ఎయిమ్స్ రోడ్డు నుంచి పానకాలస్వామి కొండపైకి మరో ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని కూడా ప్రతిపాదించారు. పడమర గాలిగోపురం అసంపూర్తిగా నిలిచింది.. ఆ నిర్మాణం పూర్తి చేయాలని ప్లాన్ చేశారు.

# తిరుమల శ్రీవారికి హైదరాబాద్ భక్తుడి భారీ విరాళం.. పెద్ద మనసుతో చెక్ ఇచ్చారు

అమరావతి :తిరుమల శ్రీవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు భారీ విరాళాన్ని అందజేశారు. టీటీడీ ట్రస్టులకు హైదరాబాద్‌కు చెందిన యలమంచిలి మదన్మోహన్ రావు రూ.30 లక్షలు ఇచ్చారు. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. ఆయన కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం.. రంగనాయకుల మండపంలో ఈ విరాళాన్ని అందజేశారు. ఇటీవల కాలంలో టీటీడీకి భక్తులు భారీగా విరాళాలు అందజేస్తున్నారు.తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులు మొక్కులు చెల్లించుకుని స్వామివారి కానుకలు, విరాళాలను అందజేస్తుంటారు. కొంతకాలంగా టీటీడీకి భక్తుల నుంచి భారీగా విరాళాలు, కానుకలు అందుతున్నాయి. తాజాగా మరో భక్తుడు తిరుమల శ్రీవారికి భారీ విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ సాఫ్ట్‌వేర్ అండ్ మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్మోహన్ రావు టీటీడీకి రూ.30 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళానికి సంబంధించి పత్రాలను అందజేశారు. ఈ విరాళాన్ని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు, ఇతర ట్రస్టులకు వినియోగించాలని దాత టీటీడీ ఛైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతను టీటీడీ ఛైర్మన్ అభినందించారు.శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం ఉదయం 8 గంటలకు అనంతతేజోమూర్తి అయిన శ్రీనివాసుడు యోగనరసింహుడి అలంకారంలో సింహ



వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వాహనం ముందు వృషభాలు, గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి మూడో రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. సింహ రూప దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి విజయ స్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనోత్సవం ద్వారా శ్రీవారు చెబుతున్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు కటాక్షిస్తారు. శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సింహ వాహనసేవలో చండ మేళం, కోలాటాల కళా ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన స్వామి కొరగజ కళా సమితి శ్రీ శ్రీకర్ బృందం చండమేళం (కేరళ డ్రమ్స్) వాయిస్తున్నారు. కేరళ డ్రమ్స్ బృందంలో మొత్తం 10 మంది కళాకారులు ఉన్నారు. వీరు డ్రమ్స్, తాళాలు లయబద్ధంగా వాయిస్తూ అందుకు అనుగుణంగా అడుగులు వేస్తూ నృత్యం చేస్తారు. వీరు గత 8 సంవత్సరాలుగా టీటీడీ అనుబంధ ఆలయాలలో జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొంటున్నారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్రం సూర్యపేటకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన బృందంలోని 16 మంది, పశ్చిమ గోదావరి జిల్లా క్రిష్ణయ్యపాళ్యంకు చెందిన శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర శ్రీ సత్యక్రిష్ణ భజన మండలికి చెందిన 100 మంది, తాడేపల్లి గూడెంకు చెందిన 15 మంది, తిరుపతికి చెందిన కళా బృందాలు కోలాటం నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# ఎవరూ లేని సమయం చూసి.. అత్తపై ఇల్లరికపు అల్లుడు అత్యాచారం

నాగర్‌కర్నూల్ : జిల్లా కల్వకుర్తి మండలంలో సమాజం తలదించుకునే ఘటన చోటు చేసుకుంది. తల్లిలా భావించాల్సిన అత్తపై ఓ ఇల్లరికపు అల్లుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం విషయం బయటకు తెలిసిపోతుందని భయపడి ఆమెను కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటనపై స్థానికంగా కలకలం రేపగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.ప్రస్తుత సమాజంలో బంధాలకు అర్థం లేకుండా పోతోంది. తల్లి తరువాత తల్లిగా భావించాల్సిన అత్తపైనే ఆ అల్లుడు కన్నేశాడు. కామంతో కళ్లుమూసుకుపోయి ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి ఒడిగట్టాడు. పశువులా ప్రవర్తించి ఆమెపై అత్యాచారం చేయటమే కాకుండా.. తన నేరం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో అత్యంత కిరాతకంగా హతమార్చాడు. మనిషిలోని క్రూరత్వానికి పరాకాష్టగా నిలిచిన ఈ దారుణ ఘటన సమాజాన్ని విస్మయానికి గురి చేస్తోంది.నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కల్వకుర్తి సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలంలోని ఓ గ్రామానికి గ్రామానికి చెందిన మహిళకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరికీ వివాహాలు జరిపించారు. వారిలో పెద్ద కుమార్తెను తిమ్మాజీపేట మండలానికి చెందిన ఓ వ్యక్తితో పెళ్లి జరిపించింది. అయితే అల్లుడు మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా నిత్యం తాగుతూ కూతుర్ని హింసించేవాడు. అది చూసి తట్టుకోలేని ఆమె తల్లి.. కుమార్తెను, అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంది.అయినా అల్లుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇటీవల భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరగింది. దీంతో భార్య తన భర్తపై అలిగి బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అల్లుడు అత్తపై కన్నేశాడు. మద్యం మత్తులో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో కావటం, ఇంట్లో ఎవరూ లేకపోటవంతో ఆమె ప్రతిఘటించినా ఫలితం లేకుండా పోయింది. మృగంలా మారి ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం తన తప్పు ఎక్కడ తెలిసిపోతుందని భయం అతడిలో మట్నదలైంది. అత్తను చంపేయాలని డిసైడ్ అయ్యాడు. పక్కనే ఉన్న బండరాయితో మోది ఆమెను కిరాతకంగా చంపేశాడు.హత్య తర్వాత అల్లుడు ఇంటి నుంచి పరారయ్యాడు. ఉదయం పక్కింటి వాళ్లు లేచి చూసేసరికి మహిళ రక్తపు మడుగులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. దారుణానికి ఒడిగట్టిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణలో మరో ఉప ఎన్నిక, ముహూర్తం..!?



హైదరాబాద్: తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. మున్సిపల్ ఎన్నికల వేళ మూడు ప్రధాన పార్టీలు కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నాయి. ఈ ఎన్నికలు ఈ మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అందరికంటే సీఎం రేవంత్ కు మున్సిపల్ ఫలితాలు సమర్థతకు పరీక్షగా నిలుస్తు న్నాయి. కాగా.. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తరువాత తెలంగాణలో మరో ఉప ఎన్నిక దిశగా కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి దాదాపు ముహూర్తం ఖరారైంది. మున్సిపల్ ఫలితాల తరువాత అధికారికంగా నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.తెలంగాణలో అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక దాదాపు ఖాయమైనట్లు సమాచారం. ఇందు కోసం అధికార కాంగ్రెస్ సిద్దం అవుతోంది. మున్సిపల్ పోరు పూర్తయిన వెంటనే ఈ ఉప ఎన్నిక దిశగా వేగంగా నిర్ణయాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. పార్టీ మారిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ గులాబీ పార్టీ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో పది మందిని విచారించిన స్పీకర్ ఎనిమిది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చేశారు. మరో ఇద్దరు నేతల విషయంలో మాత్రమే విచారణ పెండింగ్ లో ఉంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలను విచారించారు. వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయం వెలువడాల్సి ఉంది. దానం కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్దిగా పోటీ చేయటంతో.. ఆయన పైన వేటు తప్పదనే చర్చ కొనసాగుతోంది. దీంతో, దానం నాగేందర్ తో రాజీనామా చేయించి ఉప ఎన్నికకు వెళ్లే ఆలోచన ఖరారైనట్లు తెలుస్తోంది.ఈ ఇద్దరి విషయంలో స్పీకర్ తుది నిర్ణయం కీలకం కానుంది. ఇప్పటికే సుప్రీంకోర్టు సైతం పెండింగ్ అనర్హత పిటీషన్ల పైన నిర్ణయం తీసుకోవాలని సూచన చేసింది. మరో మూడు వారాలు గడువుగా నిర్దేశించింది. ఆ గడువు ఈ నెల మూడోవారానికి పూర్తి కానుంది. మరో వైపు రేపు (బుధ రం) జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫలితాలు ఈ నెల 13వ తేదీన విడుదల కానున్నాయి. దీంతో ఆ తర్వాత స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది. 2023 శాసనసభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. తో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశాలున్నాయి. దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ ఇందుకు సిద్ధంగా ఉంది. 2023 ఎన్నికల తర్వాత వరసగా హైదరాబాద్ నగరంలో కంటోన్మెంట్, జూబ్లీ ల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఖైరతాబాద్ లో ఉప ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. దీంతో.. మున్సిపల్ ఫలితాలకు అనుగుణంగా ఉప ఎన్నిక పైన తుది నిర్ణయం ఖాయంగా కనిపిస్తోంది.

## తెలంగాణతో నీటి వివాదం వేళ కేంద్రానికి చంద్రబాబు కీలక ప్రతిపాదన..!

హైదరాబాద్:పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకో వాలని సీఎం చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో చంద్రబాబు సమావేశమయ్యారు. పలు సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలని చంద్రబాబు కోరారు.కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను(రాజొ) శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-×× పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-××లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు.నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్క రించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## అమెరికాలో సమ్మక్క, సారక్క జాతర.. ఇక గద్దెలు కడితే సెట్టూ, వీడియో అదిరింది..!




హైదరాబాద్:సమ్మక్క, సారలమ్మ జాతర ఖండాతరాలు దాటింది. కొందరు యువకులు అగ్రరాజ్యం అమెరికాలో జాతర నిర్వహించారు కొందరు యువత. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అమ్మలకు ఇష్టమైన బెల్లాన్ని వారి ప్రతిరూపాలుగా భావించి పూజలు చేసి దీపధూప నైవేద్యాలు సర్పించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. ఇక అక్కడ గద్దెలు కడితే సెట్టూ అని ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు.ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన ములుగు జిల్లా మేడారం సమ్మక, సారలమ్మ జాతర వైభవంగా ముగిసింది. జనవరి 28 నుంచి జనవరి 31 వరకు మట్నత్తం నాలుగు రోజుల పాటు గద్దెలపై కొలువైన అమ్మలు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ మహా జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు హాజరయ్యారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకొని మట్నక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. విదేశాల్లో ఉన్న కొందరు జాతర కోసం ప్రత్యేకంగా విమానం టికెట్లు బుక్ చేసుకొని మరీ వచ్చారు. ఇక విదేశాల నుంచి రాలేని మరికొందరు అక్కడే సమ్మక్క, సారలమ్మ జాతరను నిర్వహించారు.తాజాగా సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. 'అమెరికాలో సమ్మక్క, సారక్క జాతర' పేరుతో కొందరు యువత ఇన్‌స్టాలో ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో అమ్మలకు ఎంతో ఇష్టమైన బంగారాన్ని (బెల్లం) సమ్మక్క, సారలమ్మలుగా ప్రతిష్ఠించారు. ఇక జాతరలో చేసే కత్రువులు అన్నీ మద్యం సాక పోయటం, మాంసాహారం పెట్టడం, దీపధూపనైవేధ్యాలు పెట్టి తమను చల్లంగా చూడాలని వేడుకొన్నారు. ఆ తర్వాత యువతీ, యువకులంతా కలిసి ఒకే చోట కూర్చొని సామూహిక భోజనాలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ వీడియో చూసిన నెటిజన్లు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తున్నారు. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా.. ఏపీటమెక్కిన ఎవ్వరు ఏమనినా.. నిలపరా నీ జాతి నిండు గౌరవము అనే విధంగా నిలిపారు మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను అమెరికాలో కూడా మీరు చేసే అద్భుతానికి శతకోటి వందనాలు' అని కామెంట్లు పెడుతున్నారు. 'అది లెక్క.. అట్లుంటది మనతోని... ఏడికిపోయిన మా తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోం.. అమెరికాలోనూ గద్దెలు కడితే సెట్టు ఇగ... అన్నీ చేసిను కానీ.. యాటపోతును కోసుడు మర్చిరు.' అని ఫన్నీగా తమ అభిప్రాయాలను చెబుతున్నారు.

## తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు.. ఆ ఏరియాపై స్పెషల్ ఫోకస్, అతి త్వరలోనే..!



హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు.ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

## టెన్త్ చదివే బాలికతో టీచర్ లవ్.. ఇద్దరు కలిసి రహస్యంగా.. ఇలా తయారయ్యారేంట్రా..!

హైదరాబాద్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సమాజం విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ టీచర్ స్కూల్‌లో చదివే అమ్మాయిని ట్రాప్ చేశాడు. పదో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. విషయం బాలిక తల్లికి తెలియటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్టూడెంట్‌ను పెళ్లి చేసుకున్న టీచర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.గురువును దైవంగా భావించే మన సమాజంలో.. ఒక ఉపాధ్యాయుడు ఆ నమ్మకాన్ని కాలరాశాడు. విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన ఆ టీచర్.. తన వక్రబుద్ధితో ప్రేమపాఠాలు నేర్పాడు. మైనర్ అని కూడా చూడకుండా పదో తరగతి చదివే బాలికను ప్రలోభపెట్టి ఇంటి నుంచి తీసుకెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న వికృత ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సినవాడు రాక్షసుడిగా మారి.. పవిత్రమైన బంధానికి మచ్చ తెచ్చిన ఈ కిరాతక ఉపాధ్యాయుడి ఉదంతం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టారు.వివరాల్లోకి వెళితే.. పోచారం డివిజన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పర్రే మైటీన్ (27) అనే వ్యక్తి ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై మైటీన్ కన్నేశాడు. బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. తెలిసీ తెలియక బాలిక ఉపాధ్యాయుడిని ప్రేమించింది. అతడి మైకంలోనే ఉండిపోయింది. చెప్పినట్లు చేసింది. ఇంట్లో చెప్పకుండా ఓ రోజు ఇద్దరు కలిసి రహస్యంగా పెళ్లి కూడా చేసుకున్నారు. ఆ తర్వాత యథావిధిగా బాలిక స్కూలుకు వెళ్తోంది. అయితే 20 రోజుల కిందట విద్యార్థిని మెడలో పసుపు తాడు ఉండటం చూసిన తల్లి ఏంటని ప్రశ్నించింది. ముందు అదేం లేదని విద్యార్థిని బుకాయించిన తల్లి గట్టిగా ప్రశ్నించే సరికి నిజం చెప్పింది.స్కూల్‌లో టీచర్ విషయం, ఆ తర్వాత రహస్యంగా పెళ్లి చేసుకోవటం ఇలా అన్ని విషయాలు తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాలిక కుటుంబ సభ్యులు స్కూల్‌కు వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. వారి నుంచి




నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు బాలికను రహస్యంగా పెళ్లి చేసుకున్న పర్రే మైటీన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. 'చదువు చెప్పమంటే ప్రేమ పాఠాలు చెప్పటమేంట్రా.. ఇలా తయారయ్యారేంట్రా..' అని స్థానికులు అనుకొంటూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతు ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వ విధానాలు- బొడ్డపాటి బ్రహ్మయ్య



రాయల్ జర్నలిజం (ఒంగోలు), ఫిబ్రవరి 10: భారత్, అమెరికా మధ్య కుదిరిన ఒప్పందంలో భారత పొగాకు రైతుల ప్రయోజనాలు పూర్తిగా పరిరక్షించబడ్డాయని, పొగాకు, పొగాకు ఉత్పత్తులకు సంబంధించి ఎలాంటి సుంకము సడలింపులు ఇవ్వకపోవడం వల్ల రైతులు వేలం వ్యవస్థ, ఎగుమతిదారులకు ఎంతో ప్రయోజనంగా ఉన్నాయని, అన్ మాన్యుఫాక్చర్డ్ పొగాకుపై ఎక్సైజ్ డ్యూటీ 18 శాతం నుండి 0 శాతానికి తగ్గించడం రైతులకు ఎంతో ఉపశమనంగా ఉందని, ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, మసాలా దినుసులు, టీ, కాఫీ, కొబ్బరి, జీడిపప్పు, మామిడి మార్కెట్లో ప్రపంచంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న భారత వ్యవసాయ రైతు సంఘాలు ఈ ఒప్పందం ద్వారా మరింత బలపడతాయని మాజీ పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య ఒక ప్రకటన్లో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ విదేశీ పొగాకు భారత మార్కెట్లోకి రాకుండా రైతులకు భరోసా కల్పించారని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని గౌరవం, భద్రత కాపాడుతూ ఈ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఒప్పందం ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ లక్ష్యాలకు బలమైన పునాది అని బ్రహ్మయ్య తెలిపారు.

# 16న ఒంగోలులో శ్రీగిరి గిరి ప్రదక్షిణ



రాయల్ జర్నలిజం (ఒంగోలు), ఫిబ్రవరి 10: మాఘ బహుళ చతుర్దశి ఫిబ్రవరి 16వ తేదీ సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వరి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తియుతంగా, శోభాయమానంగా జరుగుతుందని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్దగల శ్రీ బాపూజీ గోశాల వద్ద గోపూజ నిర్వహించుకుని భక్తులందరూ సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్లను ప్రతిష్ట చేసి భక్తులు తమ బుజస్కంధాలపై మోస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంతటి మహిమాన్వితమైన రోజున సామూహికముగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో బంధుమిత్రులు, సకుటుంబ సపరివార సమేతంగా గిరిప్రదక్షిణలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు.

# వెట్టిచాకిరి కి చెక్ పెట్టాలి: బాపట్లలో వెట్టిచాకిరి నిర్మూలన కరపత్రాల ఆవిష్కరణ



రాయల్ జర్నలిజం(బాపట్ల) ఫిబ్రవరి 10 : వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను మంగళవారం బాపట్ల జిల్లా ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్. నరేష్ కుమార్ అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమము డీవీఆర్సీ బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తైనప్పటికీ ఇంకా కొన్ని చోట్ల ఈ అమానుష వ్యవస్థ ఆనవాళ్లు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెట్టిచాకిరి అనేది నేరమని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఎవరూ బానిసలుగా పనిచేయాల్సిన అవసరం లేదని ప్రజలు స్పష్టంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెట్టిచాకిరి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న రక్షణ, పునరావాసం, చట్టపరమైన సహాయంపై ఈ కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బాధితులు ఎలాంటి భయాలు లేకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, వెట్టిచాకిరి వ్యవస్థ పూర్తిగా నిర్మూలించబడే వరకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి. వెంకటేశ్వర్లు, ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఆర్. నరహరి (ఒంగోలు), డీబీఆర్సీ కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి

- పేకాట ఆడుతున్న 9 మంది అరెస్ట్, రూ.1,02,150/- నగదు స్వాధీనం
- 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు అందిన సమాచారంతో వేగంగా స్పందించిన పోలీసులు
- నగదుతో పాటు 9 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు సీజ్
- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి: జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



రాయల్ జర్నలిజం (కర్లపాలెం), ఫిబ్రవరి 10: జిల్లాలో నేరాలను, చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. నేరాలను మరింత సమర్ధవంతంగా కట్టడి చేయాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ భరోసా ఇచ్చారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక డంపింగ్ యార్డ్ పరిసరాలలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని మంగళవారం 112 నెంబర్‌కు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం ఆధారంగా కర్లపాలెం ఎస్.ఐ ఎస్.రవీంద్ర తక్షణమే స్పందించి వారి సిబ్బందితో కలిసి వెళ్ళి పేకాట శిబిరంపై మెరుపు దాడి చేశారన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి జూదానికి ఉపయోగిస్తున్న రూ. 1,02,150/- నగదును సీజ్ చేయడంతో పాటు 9 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పేకాట, కోడిపందాలు ఇతర అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో పలు పేకాట స్థావరాలను గుర్తించి, వాటిపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ పరంగా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వేగవంతంగా స్పందించి పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న కర్లపాలెం ఎస్.ఐ, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 10: నియోజకవర్గంలోని 93 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 68,94,484 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మంగళవారం కొత్తపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గం నందు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు 23 కోట్లతో నూతన క్రిటికల్ ప్లేయర్ యూనిట్ హాస్పిటల్ నిర్మిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు మెరుగు కొరకు 14 కోట్లతో హెల్త్ కేర్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తుందని అన్నారు. చీరాల నియోజకవర్గం నందు ఇప్పటివరకు 816 మందికి రూ. 7.71 కోట్ల సీఎం సహాయ నిధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో అందించడం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య, చీరాల, వేటపాలెం, పట్టణ గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల స్థాయి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారత లక్ష్యంగా మహా కూటమి ప్రభుత్వం అడుగులు

## పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్



పెడన

స్వయం సహాయక బృందం (డ్వాక్రా) సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ టీచర్లకు సబ్సిడీ తో కూడిన బ్యాటరీ సైకిళ్లను మహా కూటమి ప్రభుత్వం అందజేస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు వెలుగు పథకం ద్వారా పెడన నియోజకవర్గంలోని 4 మండలాల్లో 24మందికి సబ్సిడీ బ్యాటరీ సైకిల్స్ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణా ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూగ్రీన్ ఉ హెల్తీ " కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్ట్, స్థిరమైన రవాణాను ప్రోత్సహించడం మరియు ప్రయాణ ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా మొదలుపెట్టారు అనిసరఫరా చేయబడిన ఈ-సైకిళ్లు రోజువారీ ప్రయాణానికి అనుకూలంగా రూపొందించబడ్డాయి అని, వీటిలో రీఛార్జబుల్ బ్యాటరీలు, పెడల్-అసిస్ట్ మోడ్‌లు మరియు మెకానికల్ డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి అని అన్నారు.ఎలక్ట్రిక్ సైకిళ్ల విలువ సుమారు ?35,000, సబ్సిడీ ?11,000. ద్వారా లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అందిస్తుంది అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహా కూటమి నాయకులు శలపాటి ప్రసాద్, కూనపురెడ్డి వీరబాబు, ఓడుగు తులసి రావు, శిరం ప్రసాద్, కూనసాని చిన్న, నాగిడి చెన్న కేశవులు, యాదం రెడ్డీ కొండా, గోపి నాగబాబు, షేక్ రఫీ, కట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు......

# ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు సేవలు ప్రశంసనీయం



విశాఖపట్నం, ఫిబ్రవరి 10 : ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, ప్రజలతో అనుసంధానం, మీడియాతో సమన్వయం వంటి అంశాలలో వారు సమర్ధవంతంగా పనిచేశారని కొనియాడారు. డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వారిద్దరినీ ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి, దుశ్శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవలు అందించాలని, కొత్త బాధ్యతల్లోనూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ పనితీరును కనబరిచి అందరి ప్రశంసలూ అందుకోవాలన్నారు. శ్రీనివాసరావు పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు వెళ్తుండగా, వెంకటరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్, సీనియర్ అసిస్టెంట్ లావణ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

RNI : APBIL/2023/86665
రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# Is Costco Really Coming To Hyderabad Soon?

Yesterday, there were a series of reports about leading United States retail chain Costco, coming to Hyderabad for their upcoming series of operation. It was established that Hyderabad could be witnessing a series of supermarkets from Costco, which are known in the United States for their affordable prices.Virtually everyone got excited about the prospect of Costco entering the Indian market through Hyderabad very soon, and there was a lot of discussion happening on the same. However, the latest developments are suggesting that there is very little chance that the leading retail product chain in the United States could be entering the Hyderabad market anytime soon.While Costco's GCC ( IT hub) in Hyderabad is confirmed, the chances of Costco stores in India look slim. India still does not allow 100% FDI in multi brand retail, which makes Costco's model difficult to execute. This leaves them with two options: operate purely in B2B like Metro or Walmart Best Price, or enter with an Indian partner holding 51% ownership. It's hard to imagine Costco giving up a 49% stake in India just to enter the Indian market.The only other workaround would be to sell only Kirkland products and position itself as a single brand retailer, similar to IKEA. But Costco changing its global business model just for India seems highly unlikely. But at the same time, interestingly, Costco also posted welcoming India to "Retail Network". This is leading to a speculation that Costco may open stores too. With tariffs eased, it actually seems like a possibility. But for now, we have to patiently wait and see if the company would actually open its retail outlets in the city, or its the other way around.

# It's Official: India Vs Pakistan Game Is Happening!



The much anticipated game between India and Pakistan was in jeopardy after Pakistan communicated that Pakistan wouldn't be participating in the same. But things have turned around drastically now and it's established that the game would be happening as per plan.Pakistan has officially confirmed that its national cricket team will participate in the ICC Men's T20 World Cup fixture on February 15, 2026, effectively putting an end to the uncertainty that had surrounded the much anticipated clash with India. The announcement came after what the government described as successful multilateral discussions and requests from friendly nations, indicating that diplomatic efforts played a key role in ensuring the match goes ahead.In recent weeks, speculation had been growing over whether Pakistan might withdraw from the game due to political tensions and logistical concerns. Fans across the cricketing world were worried that one of the sport's biggest rivalries could be disrupted. However, the latest directive from the Government of Pakistan makes it clear that the team has been instructed to take the field as scheduled.An India Pakistan encounter is widely regarded as the marquee event of any global cricket tournament, often drawing record viewership and massive stadium attendance. Beyond the sporting contest, the match carries emotional weight for millions of supporters on both sides of the border.With the confirmation now in place, excitement is expected to surge among fans, broadcasters, and tournament organizers. Attention will soon shift from off field controversy to on field action, as the cricket world prepares for another high intensity showdown between the two traditional rivals.

# Tirumala Laddu Issue: What's Revanth Reddy's Reaction?




The ongoing controversy surrounding the Tirumala Laddu has become a major cause of concern. The Andhra Pradesh government is almost extensively involved with the same as they have been pushing the blame on YSR Congress ecosystem for the alteration of Laddoo ghee .The Tirumala laddu controversy has recently sparked intense debate, drawing political attention from both Andhra Pradesh and Telangana. The issue reportedly revolves around concerns related to the preparation and management of the iconic laddu prasadam at the Tirumala Tirupati Devasthanams, triggering criticism, allegations, and demands for clarity from various groups.As the matter gained traction, several political leaders were asked to respond, given the laddu's deep religious significance for millions of devotees across the country.However, Telangana Chief Minister Revanth Reddy firmly refused to comment on the controversy. Speaking to the media, he stated that the Tirumala laddu issue belongs to a neighboring state and that the Telangana government has no authority to intervene."It is an issue of another state. We have no scope to interfere," he clarified, signaling a deliberate effort to stay away from a sensitive religious and administrative matter.Revanth further stressed the importance of respecting state boundaries when it comes to governance and temple administration. He indicated that the Andhra Pradesh government and the Tirumala Tirupati Devasthanams are fully capable of addressing the situation.His response reflects a cautious political approach, aiming to avoid inter state friction while ensuring that Telangana remains focused on its own administrative priorities rather than engaging in controversies beyond its jurisdiction.

# Thalapathy Following Chiru, Pawan and NTR?



It's already known that Tamil superstar Thalapathy Vijay is soon venturing in politics in his first ever electoral campaign in Tamil Nadu. Vijay, known as "Thalapathy" and celebrated as a powerhouse superstar on the silver screen, is now looking to make an equally loud impact in the political arena.After founding the Tamilaga Vettri Kazhagam party, he has gained a different level of popularity across Tamil Nadu. Many people who are seeking political change are cheering for TVK, and the youth in particular appear to be extending strong support to Vijay.Against this backdrop, Vijay is confident that his party will certainly form the government in the upcoming elections. He has also made it clear that he does not want to be seen as a kingmaker but as the king himself.With the election season approaching, Vijay has been conducting regular meetings with party leaders and carefully crafting strategies. There is strong talk within party circles that he may contest from not just one but two constituencies. As a first time contestant, this plan is believed to be aimed at proving his political strength while also ensuring a safer electoral ground. Party insiders say that if the party chief contests from two key regions, it could also benefit TVK candidates in those areas.Reports suggest that the two seats Vijay is considering are Virugambakkam in Chennai and Tiruchirappalli East, both considered strong fortresses of the ruling DMK. Vijay is said to believe that if he is going to strike, it should be at the very heart of the opponent's base. By selecting these constituencies, he is reportedly aiming to showcase his party's capability in urban centers.Vijay is also believed to be targeting young voters, especially those who will be exercising their franchise for the first time. Given his strong following among the youth, the party is confident of registering an impressive victory.Virugambakkam has long been seen as a DMK bastion, and by challenging the party there while also choosing Tiruchirappalli East as a second seat, Vijay's intention is said to be to signal that TVK has strength across the state.Both constituencies currently have influential leaders from the DMK, with sitting MLAs AMV Prabhakar Raja and Inigo S. Irudayaraj. A direct contest against them is expected to make the elections highly dramatic. TVK is also preparing for major political activity in these regions soon.Looking at political history in Andhra Pradesh, Chiranjeevi contested from two constituencies in 2009 on behalf of the Praja Rajyam Party. He lost in Palakollu but won in Tirupati.In the 2019 elections, Pawan Kalyan contested from Gajuwaka in Visakhapatnam and Bhimavaram but faced defeat in both seats. However, in 1983, NTR founded the Telugu Desam Party and contested from Gudivada and Tirupati, winning both and leading his party to a historic victory.Like them, Vijay also comes from the film industry, and his decision to contest two seats has become a major talking point. There is growing debate over whether he can achieve a grand political triumph and emerge as another NTR in Indian politics.







# సౌతాఫ్రికా శుభారంభం.. చిత్తుగా ఓడిన కెనడా!



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని సౌతాఫ్రికా ఘనంగా ప్రారంభించింది. గ్రూప్-డీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా కెనడాతో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 57 పరుగుల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో ఎయిడెన్ మార్క్‌రమ్ సత్తా చాటగా.. బౌలింగ్‌లో లుంగి ఎంగిడి సత్తా చాటాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్(32 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 59) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. ర్యాన్ రికెల్టన్(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), డేవిడ్ మిల్లర్(23 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 39 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 నాటౌట్) దూకుడుగా ఆడారు. కెనడా బౌలర్లలో అన్ష్ పటేల్(3/31) మూడు వికెట్లు తీయగా.. దిల్‌ప్రీత్ బాజ్వా ఒక వికెట్ పడగొట్టాడు.అనంతరం కెనడా 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 పరుగులు చేసి ఓటమిపాలైంది. నవ్‌నీత్ ధలివాల్( 49 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 64) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా.. హర్ష్ థాకర్(29 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(4/31) నాలుగు వికెట్లు తీయగా.. మార్కో యాన్సెన్(2/30) రెండు వికెట్లు పడగొట్టాడు. కగిసో రబడా, కార్బిన్ బోష్‌కు చెరో వికెట్ దక్కింది.

**కళ్లు చెదిరే క్యాచ్..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా తమ ఇన్నింగ్స్‌ను దూకుడుగా మొదలుపెట్టింది. డికాక్, మార్క్‌రమ్ వేగంగా పరుగులు చేశారు. దాంతో పవర్ ప్లేలో సౌతాఫ్రికా వికెట్ నష్టపోకుండా 65 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం డికాక్(25) ఔటైనా.. ర్యాన్ రికెల్టన్‌తో కలిసి మార్క్‌రమ్ చెలరేగాడు. 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను డిలన్ హీలింగర్ కళ్లు చెదిరే క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. బౌండరీ లైన్‌పై హీలింగర్ అద్భుతంగా బంతిని అందుకున్నాడు. డెవాల్డ్ బ్రెవిస్(6) విఫలమైనా.. డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్ దూకుడుగా ఆడి జట్టుకు భారీ స్కోర్ అందించారు.

**ధలివాల్ ఒంటరి పోరాటం..**

భారీ లక్ష్య ఛేదనలో కెనడాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగ్గా.. మరో ఓవపెనర్ యువరాజ్ శర్మ(12) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. నికోలస్ కిర్టన్ కూడా పెవిలియన్ చేరాడు. ఈ ముగ్గురిని లుంగి ఎంగిడే ఔట్ చేశాడు. శ్రేయస్ మొవ్వ(9)ను రబడా క్లీన్ బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే కెనడా 4 వికెట్లు కోల్పోయింది.ఈ పరిస్థితుల్లో హర్ష్ థాకర్(33)తో కలిసి నవ్‌నీత్ ధలివాల్ జట్టును ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. హర్ష్ థాకర్ ఔటైనా.. సాద్ బిన్ జఫార్(1) సాయంతో ధలివాల్ 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యాన్సెన్ బౌలింగ్‌లో సాద్ బిన్, జస్కరణ్ సింగ్ వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. ధలివాల్‌కు అండగా మరో బ్యాటర్ రాణించలేదు.

# అది జరగదమ్మా.. పాక్ డిమాండ్స్‌ను తిరస్కరించిన ఐసీసీ!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన హైఓల్టేజ్ మ్యాచ్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పెట్టిన 5 డిమాండ్లలో మూడింటిని ఐసీసీ తిరస్కరించింది. ముఖ్యంగా భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల పునరుద్ధరణ, భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య ట్రై సిరీస్ నిర్వహించాలనే డిమాండ్లను ఐసీసీ తోసిపుచ్చింది.పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడాలని బీసీసీఐని ఆదేశించే అధికారం తమకు లేదని, ఈ అంశం తమ పరిధిలో లేదని పీసీబీకి ఐసీసీ తేల్చి చెప్పింది. బీసీసీఐకి మాత్రమే ఈ అధికారం ఉందని, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బీసీసీఐ నడుచుకుంటుందని పీసీబీకి ఐసీసీ స్పష్టం చేసింది.ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పీసీబీతో ఐసీసీ చర్చలు జరిపింది. లాహోర్‌లో ఆదివారం పీసీబీ ఛైర్మన్ మోహిసిన్ నఖ్వీతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం సమావేశమయ్యారు.ఐదు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ఐసీసీ ముందు పాకిస్థాన్ ఐదు డిమాండ్లు పెట్టింది. అలాగే బంగ్లాదేశ్‌కు పూర్తి రెవెన్యూ ఇవ్వడం, వారికి భవిష్యత్ ఐసీసీ టోర్నమెంట్ కేటాయించడంతో పాటు వారిపై చర్యలు తీసుకోవద్దని, పార్టిసిపేషన్ ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ రెండు డిమాండ్లకు అంగీకరించిన ఐసీసీ.. తుది నిర్ణయం వెల్లడించేందుకు 24 గంటల సమయం ఇచ్చింది. సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం భారత్-పాక్ మ్యాచ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.మరోవైపు ఐసీసీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని బీసీసీఐ తెలిపింది.షెడ్యూల్ ప్రకారం భారత జట్టు శ్రీలంకకు వెళ్లి మ్యాచ్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంది. భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ఐసీసీకి బంగారు బాతులాంటిది. ఈ మ్యాచ్ ద్వారా సుమారు రూ.2200 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

# వాలెంటైన్స్ డే.. 'కపుల్'కు కలిసొస్తుందా?

టాలీవుడ్ లో ప్రతి ఏడాది ఫిబ్రవరి 14కు మంచి క్రేజ్ ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఆ రోజు థియేటర్లలోకి వచ్చే సినిమాలు.. స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తాయి. ముఖ్యంగా లవ్ స్టోరీలైతే ఆడియన్స్ లో మరింత ఆసక్తి రేపుతాయి. అలాంటి టైమింగ్ ను క్యాష్ చేసుకునేందుకు ఇప్పుడు సిద్ధమవుతున్నారు యంగ్ హీరో సంతోష్ శోభన్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి.సంతోష్, మానస కలిసి జంటగా కపుల్ ఫ్రెండ్లీ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. లవ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై అజయ్ కుమార్ రాజు రూపొందిస్తున్నారు. ప్రేమ, యువత ఆలోచనలు, మోడ్రన్ రిలేషన్స్ వంటి అంశాలతో సిద్ధమవుతున్న ఆ మూవీ.. వాలెంటైన్స్ డే స్పెషల్ గా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్.. ముఖ్యంగా ట్రైలర్ మూవీపై ఆసక్తి రేపింది. అదే సమయంలో మేకర్స్ కూడా ప్రమోషన్లను సినిమా మూడ్ కు తగ్గట్టే సాఫ్ట్ గా నిర్వహిస్తున్నారు. భారీ హంగామా కాకుండా మెలోడీ పాటలు, క్యూట్ టీజర్లు, జంట మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసే వీడియోలతో యూత్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.అయితే కపుల్ ఫ్రెండ్లీ మూవీ.. సంతోష్, మానసకు ఇద్దరికీ కీలకమైన సినిమా. ఆ జంట కెరీర్ కు టర్నింగ్ పాయింట్ గా మూవీ నిలుస్తుందా అని అంతా ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు. నిజానికి.. సంతోష్ శోభన్ కు టాలెంట్ ఉన్న నటుడిగా గుర్తింపు ఉన్నప్పటికీ సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. పలు సినిమాలు చేసినా.. అవి ఆశించిన స్థాయిలో ఆడియన్స్ ను ఆకట్టుకోవడం లేదు.అందుకే మంచి కథ, సరైన టైమింగ్ ఉంటే తిరిగి ఫామ్ లోకి రావచ్చనే నమ్మకంతో సంతోష్ కపుల్ ఫ్రెండ్లీపై ఆశలు పెట్టుకున్నారు. ఇక మానస వారణాసి విషయానికి వస్తే, మోడలింగ్ వరల్డ్ నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టిన ఆమెకు ఇప్పటివరకు పెద్ద బ్రేక్ దక్కలేదు. అశోక్ గల్లా హీరోగా వచ్చిన సినిమాలో నటించినప్పటికీ ఆ చిత్రంతో అనుకున్నంత క్రేజ్ రాలేదు. అందుకే ఈసారి రొమాంటిక్ ఎంటర్టైనర్ తో ప్రేక్షకులను మెప్పించాలని భావిస్తోంది.అదే సమయంలో వాలెంటైన్స్ డే రోజు ప్రేమ కథా చిత్రాలకు ఫ్యామిలీ, యూత్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. అదే కపుల్ ఫ్రెండ్లీ మూవీకి ప్లస్ పాయింట్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే.. హిట్ గా నిలిచే ఛాన్స్ ఎక్కువగా ఉంది. అందుకే కెరీర్ లో సంతోష్, మానసకు కీలకమైన కపుల్ ఫ్రెండ్లీ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో.. వాలెంటైన్స్ డే రిలీజ్ కలిసొస్తుందో లేదో అన్నది వేచి చూడాలి.




# ఎల్లో శారీతో పిచ్చెక్కిస్తున్న ఫరియా అబ్దుల్లా!



ఫరియా అబ్దుల్లా.. ఆరడుగుల ఈ అందగత్తె గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఒకే ఒక్క సినిమాతో తెలుగు కుర్రాళ్ల గుండెల్లో 'చిట్టి'గా గూడు కట్టుకున్న ఈ హైదరాబాదీ ముద్దుగుమ్మ 'జాతి రత్నాలు' సినిమాతో అభిమానుల హృదయాలను దోచుకుంది. అమాయకమైన నటనతో ఆకట్టుకునే డాన్స్ తో తెలుగు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే ఆరడుగుల అందం ఈమెకు కెరియర్ మొదట్లో అవకాశాలను అందించలేదు. కారణం ఈమె హైట్ కు తగ్గట్టు హీరోలు దొరకకపోవడం. రెబల్ స్టార్ ప్రభాస్, సూపర్ స్టార్ మహేష్ బాబు మినహా ఈమె హైట్ ని సరితూగే హీరోలు లేకపోవడం వల్ల ఈమెకు ఆ అవకాశాలు లభించలేదని వార్తలు కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు యంగ్ హీరోలు ఈమె హైట్ ను బ్యాలెన్స్ చేస్తూ ఈమె నటనను ఉపయోగించుకుంటూ తమ సినిమాలతో సక్సెస్ అందుకోవడమే కాకుండా చిట్టికి కూడా మంచి అవకాశాలు కల్పిస్తున్నారు.ఇక తన అద్భుతమైన డాన్స్ పెర్ఫార్మెన్స్ తో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఫరియా అబ్దుల్లా ఇటీవల తిరువీర్ హీరోగా వస్తున్న 'భగవంతుడు' సినిమాలో తొలిసారి పల్లెటూరి అమ్మాయి పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి ప్రేక్షకులను ఆకట్టుకోబోతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక మరొకవైపు ప్రముఖ డైరెక్టర్ కం హీరో తరుణ్ భాస్కర్ హీరోగా వస్తున్న 'గాయపడ్డ సింహం' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా ఈ టీజర్ కం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించగా ఈ వేదికపై ఫరియా అబ్దుల్లా తన అందాలతో అభిమానులను మంత్రముగ్ధుల్ని చేసింది.ఎల్లో కలర్ చీర కట్టుకొని వచ్చిన ఈమె తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా ఈ పొడుగు కాళ్ళ సుందరి అందానికి దాసోహం అంటూ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే ఫరియా అబ్దుల్లా లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు.ఇదిలా ఉండగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తాను ప్రేమలో పడ్డ విషయాన్ని కూడా అభిమానులతో పంచుకుంది. సాధారణంగా హీరోయిన్లు తమ రిలేషన్షిప్ ను బహిరంగంగా బయట పెట్టడానికి ఆసక్తి కనబరచరు. కానీ ఫరియా అబ్దుల్లా మాత్రం తాను రిలేషన్ లో ఉన్న విషయాన్ని బాహాటంగా బయటకి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచిందిఇటీవల ఆమె మాట్లాడుతూ.." నేను ఒక వ్యక్తితో ప్రస్తుతం గాఢమైన ప్రేమలో ఉన్నాను.ఇక నా ప్రియుడి విషయానికొస్తే నేను ప్రేమిస్తున్న వ్యక్తి ముస్లిం కాదు.ఆయన ఒక హిందువు. వృత్తిపరంగా కొరియోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు. నా సినిమాల్లో నా డాన్స్ ఇంత బాగా రావడానికి.. నేను నా డాన్స్ ను ఇంప్రూవ్ చేసుకోవడానికి ప్రధాన కారణం ఆయనే ప్రస్తుతం మేము ప్రేమికులుగానే కాకుండా ఇద్దరం ఒక టీం లాగా కలిసి పనిచేస్తున్నాము" అంటూ ఫరియా చెప్పుకొచ్చింది.అదే సమయంలో వాలెంటైన్స్ డే రోజు ప్రేమ కథా చిత్రాలకు ఫ్యామిలీ, యూత్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. అదే కపుల్ ఫ్రెండ్లీ మూవీకి ప్లస్ పాయింట్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే.. హిట్ గా నిలిచే ఛాన్స్ ఎక్కువగా ఉంది. అందుకే కెరీర్ లో సంతోష్, మానసకు కీలకమైన కపుల్ ఫ్రెండ్లీ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో.. వాలెంటైన్స్ డే రిలీజ్ కలిసొస్తుందో లేదో అన్నది వేచి చూడాలి.

# సుమంత్ గ్రాఫిక్స్ సినిమా.. 25 కోట్లు, స్టార్ క్యామియోనా..

టాలీవుడ్ సీనియర్ హీరో సుమంత్ స్పీడ్ పెంచారని చెప్పాలి. ఓటీటీలో వచ్చిన అనగనగా మూవీతో సక్సెస్ ట్రాక్ ఎక్కిన ఆయన.. వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. అందులో భాగంగా ఇప్పుడు మహేంద్రగిరి వారాహి మూవీ చేస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ సూపర్ నేచురల్ చిత్రంగా రూపొందుతున్న ఆ సినిమా స్టోరీ.. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరగనుంది.సంతోష్ జాగర్లపూడి




దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను మధు కాలిపు నిర్మిస్తుండగా.. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంది. సోమవారం నాడు సుమంత్ బర్త్ డే కానుకగా మేకర్స్ రివీల్ చేశారు. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన గ్లింప్స్.. ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. అయితే ఇప్పుడు సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ చక్కర్లు కొడుతున్నాయి.పౌరాణిక అంశాలు, అడ్వెంచర్ ఎలిమెంట్స్, విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా ఉండనున్న మహేంద్రగిరి వారాహి సినిమాను భారీ స్థాయిలో మేకర్స్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.15-20 కోట్లకుపైగా బడ్జెట్ అయినట్లు వినికిడి. దీంతో సుమంత్ కెరీర్ లోనే అత్యంత హై బడ్జెట్ మూవీ అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. మేకింగ్ అండ్ ప్రొడక్షన్ విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీ పడడం లేదని టాక్.అదే సమయంలో సినిమాలో స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ యాక్ట్ చేస్తున్నట్లు సమాచారం. వారిద్దరూ మూవీలో క్యామియో రోల్స్ లో కనిపించనున్నారని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. మూవీ రేంజ్ ను పెంచేందుకు.. వారిద్దరినీ రంగంలోకి మేకర్స్ దించినట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా సిద్ధుకు యూత్ లో ఉన్న క్రేజ్, కీర్తి సురేష్ కు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ తో వారి రోల్స్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలవనున్నాయి.అయితే ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ కూడా సినిమాల సక్సెస్ ను నిర్ణయించే కీలక అంశంగా మారిందని ఎప్పుడూ చర్చ జరుగుతుంటుంది. మంచి ఫేమ్ ఉన్న స్టార్స్.. చిన్న పాత్రల్లో కనిపించినా ఓటీటీ డీల్స్ వాల్యూ పెరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. అందుకే ఇప్పుడు మహేంద్రగిరి వారాహి మూవీకి స్టార్ క్యామియోలు ప్లస్ పాయింట్ గా మారుతాయని అంటున్నారు నెటిజన్లు.ఇప్పటికే కొన్ని ప్రముఖ ఓటీటీ సంస్థలు సినిమాపై ఇంట్రెస్ట్ చూపించినట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తోడు పాన్ ఇండియా రేంజ్ లో మూవీ విడుదల అయ్యే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి మహేంద్రగిరి వారాహి మూవీపై అంచనాలు పెరుగుతున్నాయి. దీంతో సుమంత్ కు ఆ చిత్రం ఎలాంటి హిట్ ఇస్తుందో.. స్టార్ క్యామియోలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో అన్నది వేచి చూడాలి. రిలీజ్ డేట్ పై త్వరలో అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే ఛాన్స్ ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , EMIL SRIKANTH9550389070@GMAIL.COM